క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని గంగడిపాలెం, పోటుమెరక, లంకెవానిదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోనలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా లూథరన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం



భట్టిప్రోలు: ఆంధ్ర సార్వత్రిక లూథరన్ సంఘం 182వ ఆవిర్భావ దినోత్సవం (గాస్పెల్ డే) సోమవారం భట్టిప్రోలు క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ ఆధ్వర్యంలో ఆంధ్ర సార్వత్రిక లూథరన్ సంఘం వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ జాన్ క్రిష్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా మణిపూర్‌లో జరుగుతున్న మతోన్మాద దాడులను తీవ్రంగా ఖండించారు. దాడుల్లో మృతి చెందిన వారికి సంతాప సూచికంగా మౌనం పాటించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరమ్మ విజయ, సంఘ పెద్దలు లింగం శ్రీనివాసరావు, కనపర్తి విక్టర్ రవి వరప్రసాద్, కనపర్తి నాగేశ్వరావు, జాలాది సామ్రాట్, కనపర్తి కోటేష్, గుంటూరు నాంచారయ్య, మండ్రు భిక్షాలు, దేవరపల్లి లూథర్‌పాల్, స్త్రీల సమాజం నిర్వాహకులు కనపర్తి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ



వేమూరు: మణిపూర్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన ఘటనపై నిరసన వ్యక్తం చేసినట్లు గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజు తెలిపారు. వేమూరులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటరులో బాబుజగ్జీవరావ్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చిగళ్ల అనిల్, యన్నం సురేష్, గురవయ్య, డి.రమేష్ రామ్‌దీ, పెనుమాల సుబ్బారావు, జి.శ్రీరామ్ ప్రసాద్, ఎలిచర్ల సురేష్ పాల్గొన్నారు.

పెదలంకలో పౌర హక్కుల దినోత్సవం



పెదలంక(భట్టిప్రోలు): పెదలంకలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి లోకనాథ్ మాట్లాడుతూ గ్రామంలో అసమానతలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పరిశుద్ధరావు, వీఆర్వో మండ్రు జక్రయ్య, హెచ్‌ఎం సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ



చింతమోటు(భట్టిప్రోలు): గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో భాగంగా వైద్యుల సిఫార్సు మేరకు కళ్లజోళ్లు అవసరమైన వారికి సోమవారం చింతమోటు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్‌రాజు మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమూరు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రచార కమిటీ కన్వీనర్ యన్నం సురేష్, యూత్ అధ్యక్షుడు అనీల్, కూచిపూడి వినయ్, సురేష్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ పథకాలు

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- అల్లమూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలి సంక్షేమ సంతోషాన్ని పంచుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

అల్లమూడి(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని అల్లమూడిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. ఏ ఎన్నికల్లో అయినా సరే సింగిల్‌గా పోటీ చేసే దమ్ము వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకే ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లమూడి, పల్లెకోన, రాచూరు సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్ కుమార్, జయవరపు రాధాకృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఉప సర్పంచ్ అల్లమూడి వెంకయ్య, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్, జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, మండల, గ్రామ పార్టీ కన్వీనర్లు మోర్ల శ్రీనివాసరావు, వేపూరి నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిశెట్టి వెంకటేశ్వరావు, పంతగాని నాంచారయ్య, కనపర్తి శరత్‌బాబు, కనపర్తి నాగయ్య, పంతగాని బాలు, రెబ్బా వెంకటేశ్వరావు, ప్రవీణ్ కుమార్, కనపర్తి ప్రశాంత్‌రాజు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

- ఎంపీ మోపిదేవి
- బావాజీపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం



బావాజీపాలెంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: ప్రజల వద్దకే పాలన అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కొనియాడారు. మండలంలోని బావాజీపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఈ సందర్భంగా బావాజీపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి.. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత మేర లబ్ధి చేకూరింది, ఏ పథకం ద్వారా ఎంత నగదు వారి ఖాతాల్లో జమ అయ్యింది అనే విషయాలను మహిళలకు పూర్తిగా ఎంపీ వివరించారు. అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందడం లేదా అని.. మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలువురు మహిళలు నివేశన స్థలాలు ఇవ్వాలని ఎంపీని కోరారు. వెంటనే స్పందించిన మోపిదేవి ఆ దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరడంతో.. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి హరనాథబాబు, సర్పంచ్ మహ్మద్ నజీర్ అహ్మద్, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, బావాజీపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకుల నివారణకు ప్రత్యేక చర్యలు



లీకుల వద్ద మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

బాపట్ల: బాపట్ల పట్టణంలోని మంచినీటి పైపులైన్ల లీకుల నివారణకు మున్సిపల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఓవర్ హెడ్ ట్యాంకు వరకు వెళ్లే ప్రధాన పైపులైన్లు లీకులు కారణంగా నీటి కాలుష్యం ఎక్కువగా ఉంది. స్థానిక మూర్తి రక్షణ నగర్, కలెక్టరేట్ సమీపంలోని ప్రధాన పైపులైన్లుకు పడిన లీకులకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ప్రొక్లెయినర్ సహాయంతో లీకులు ఉన్న ప్రాంతాల్లో కుంటలు తీయించి, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. లీకులు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో కొత్త పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైపులైన్లలో లీకులను పరిశీలించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

తల్లి పెదకర్మ రోజే.. గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



నిజాంపట్నం: గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన ఘటన గరువుపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని గరువుపాలేనికి చెందిన బొప్పా వెంకటేశ్వరరావు (61) తన తల్లి పెదకర్మ ఉండటంతో ముందు రోజు రాత్రంతా ఆ కార్యక్రమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం తెల్లవారు జామున ఆయనకు గుండెపోటు రావడంతో రేపల్లెలోని ప్రైవేటు వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి.. చికిత్స అందిస్తుండగా ఆయన తుదిశ్వాస విడిచారు. బొప్పా వెంకటేశ్వరరావు నక్షత్రనగర్ యూపీ స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. తల్లి పెద్దకర్మ రోజే కొడుకు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సదర్శించి, నివాళులర్పించారు. ఎంఈవో హరిబాబు ఉన్నారు.

శరవేగంగా రేపల్లె పట్టణాభివృద్ధి

- స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు
- మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె: ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సారథ్యంలో రేపల్లె పట్టణాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఓల్డ్ టౌన్ ప్రధాన రహదారి విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా అరవపల్లి రహదారిలో ప్రధాన కాల్వల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. త్వరితగతిన రహదారిని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో పాలిథిన్‌ను నిషేధించటం జరిగిందని, పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ వాడకం వీడేలా ప్రజలకు ప్రజా ప్రతినిధులు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం అజెండాలోని 19 అంశాలను, మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు సమావేశం ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'కు మూడు అర్జీలు

రేపల్లె రూరల్: స్పందనతో ప్రజలు తమ సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వివరాలు వెల్లడించారు. భట్టిప్రోలు మండలం నుంచి ఒకటి, పింఛన్ కోరుతూ, పోలీసు శాఖలో నమోదు చేసిన ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ మరొకటి.. మొత్తం మూడు అర్జీలు అందాయన్నారు. సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపటం జరిగిందని, త్వరితగతిన పరిష్కరించేలా పర్యవేక్షిస్తామని చెప్పారు.

నిస్వార్థ సేవలతో ప్రజల మనస్సులో సుస్థిర స్థానం



తోకలవారిపాలెంలో సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్, సిబ్బంది

కొల్లూరు: నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించే ఉద్యోగులకు ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదిస్తారని తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని కిష్కిందపాలెం సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ముగ్గురు సిబ్బందిని తోకలవారిపాలెం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక సిబ్బంది ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా అందరి దృష్టిలో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి వి.సాంబశివరావు, డీఏ కల్యాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్రబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జి. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డి మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు

ఎమ్మెల్యే కోన రఘుపతి



గోపాల్‌రెడ్డి మృత దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సైనికుడు ఆట్ల గోపాల్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం పంచాయతీ ఎం వీరాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆట్ల భిక్షావతి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆట్ల బ్రహ్మానందరెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి(85) సోమవారం మృతిచెందారు. ఎమ్మెల్యే కోన రఘుపతి గోపాల్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నివాళులర్పించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీపీ హరిబాబు

బాపట్ల అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు అన్నారు. సోమవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా వేలాది మందికి వివిధ రకాల సర్టిఫికెట్‌లు ఉచితంగా మంజూరు చేయడంలో గ్రామ సచివాలయం సిబ్బంది, మండలస్థాయి అధికారులు విశేషంగా కృషిచేశారని కొనియాడారు. వారిని ఈ సందర్భంగా అభినందించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలకు స్థల సేకరణ, పాఠశాలలో నాడు–నేడు పనులు, గడప గడపకు మన ప్రభుత్వం మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ హరిబాబు అధికారులను కోరారు. ఎంపీడీవో రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో మంచి నీటి సమస్య లేకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తాము చేపడుతున్న పథకాల గురించి తెలియజేశారు.

మణిపూర్ ఘటనపై న్యాయవాదుల నిరసన



న్యాయవాదుల నిరసన ప్రదర్శన

బాపట్ల: మణిపూర్‌లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్రదర్శన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ మాట్లాడారు. స్త్రీలపై జరిగిన హత్యాచారాలు, హత్యలను తీవ్రంగా నిరసిస్తున్నామని చెప్పారు. విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు హత్యపై నిరసన తెలియజేస్తూ కోర్టు విధులకు గైర్హాజరయ్యారు. జమ్రుద్ బాషా, సి.రవికుమార్, చలపతిరావు, స్టాలిన్, ఇమ్మడిశెట్టి సతీష్, ద్వారపల్లి పిలిప్, యెనుమల భాస్కర్‌గౌడ్, సీహెచ్ ఆంజనేయులు, దగ్గుమల్లి కిరణ్, యలవల నరేష్ పాల్గొన్నారు.

వృత్తిలో అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు

మేనేజర్ మహ్మద్ ఇమ్రాన్



దగ్గుమల్లి శామ్యూల్‌ను సన్మానిస్తున్న మేనేజర్ మహ్మద్ ఇమ్రాన్, అనిల్

బాపట్ల: వృత్తిలో అంకితభావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని స్టేట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ మహ్మద్ ఇమ్రాన్ పేర్కొన్నారు. స్టేట్ బ్యాంకులో 26 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పని చేసి, పదవీ విరమణ చేస్తున్న దగ్గుమల్లి శామ్యూల్ సన్మాన సభ స్థానిక బ్రాంచ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ చిరునవ్వుతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటంలో శామ్యూల్ ముందుంటారని తెలిపారు. బ్యాంకు ఉద్యోగులకు ఆదర్శనీయులని కొనియాడారు. సన్మాన గ్రహీత దగ్గుమల్లి శామ్యూల్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల్లో తనకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారుల సంఘం కార్యదర్శి పూనూరి అనిల్, స్టాఫ్ సెక్రటరీ స్వాములు, ఉద్యోగ సంఘాలు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాట్ బాక్స్‌లు పంపిణీ



హాట్ బాక్సులు అందజేస్తున్న తహసీల్దారు మల్లికార్జునరావు

రేపల్లె: ప్రణాళికతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. గత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 91 మందికి సోమవారం ఆయన తన తండ్రి మస్తానయ్య జ్ఞాపకార్థం హాట్ బాక్కులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



రైల్వే స్టేషన్లో అవగాహన నిర్వహిస్తున్న సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

రేపల్లె రూరల్: మహిళలను, పిల్లలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న మానవ రవాణాను నిరోధించాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉందని, అందరూ ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలని సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ బాపట్ల జిల్లా కో–ఆర్డినేటర్ అడుసుమల్లి ప్రభాకరరావు అన్నారు. సోమవారం రేపల్లె రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణాకు పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఉపాధి అవకాశాల లేమి, ఆర్థిక సమస్యలు కారణాలన్నారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ వెంకటప్పయ్య మాట్లాడుతూ ప్రజలు అక్రమ రవాణాదారులపై అనుమానం కలిగినప్పుడు దగ్గరలోని ఆర్పీఎఫ్ , సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ కానిస్టేబుల్స్, ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బంది, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ రేపల్లె, నగరం, నిజాంపట్నం మండల కో–ఆర్డినేటర్లు, కమ్యూనిటీ సోషల్ వర్కర్లు జ్యోతి, కొమరగిరి నాగేశ్వరరావు, బేతపూడి నాగేంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వరహాపురం(వేమూరు): అంకిత భావంతో పని చేసిన ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వరహాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు మాజేటి మణిప్రభ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సన్మాన సభ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీన దయాళ్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు మాజేటి మణిప్రభ అంకిత భావంతో పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యల్లమాటి స్వాతి, మండల విద్యాశాఖాధికారి రోజ్‌లాండ్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సాంబశివరావు, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

గుంటూరు ఈస్ట్: ఫ్లెక్సీ కడుతూ విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చిలుమూరు గ్రామానికి చెందిన భవనం శ్రీనివాసరావు కుమారుడు సాయి(26) గుంటూరులో ఫ్లెక్సీలు బిగించే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయి, కె.నితిన్‌లు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఫ్లెక్సీలు కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఇరువురిని జీజీహెచ్‌కు తరలించారు. సాయి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంటరానితనం చట్టరీత్యా నేరం

పాతనందాయపాలెం(కర్లపాలెం): అంటరానితనం చట్టరీత్యా నేరమని తహసీల్దారు కేశవనారాయణ అన్నారు. సోమవారం పాతనందాయపాలెం ఎస్టీ కాలనీలో కుల వివక్షతపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు పాల్గొని, మాట్లాడారు. అన్ని కులాలు, మతాల వారు సమానమేనన్నారు. అందరూ ఐకమత్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ తమ పిల్లల్ని బాగా చదివించుకోవాలని ఆకాంక్షించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.రాహేలు సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేలము ప్రకటన

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు ఈ దిగువ తెల్పిన రైతులు పసుపును హామీగా వుంచి ఋణము పొందియున్నారు. వారి యొక్క ఋణము వాయిదా మీరినది. వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు ఇచ్చినను ఋణము చెల్లించనందున వారి యొక్క పసుపును ఈ దిగువ ఉదహరించిన విధముగా సహకార సంఘముల చట్టం ప్రకారము వేలము వేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ది.03-08-2023 ఉదయం 11.00 లకు, దుగ్గిరాల, వెల్లటూరు, నల్లపాడు గ్రామములో

S.No	G.No.	NAME	L.No.	QTS	DATE OF DISBURS	AMOUNT	STOCK PLACE
1	5713	రవివరపు శంకరరావు తండ్రి సాంబశివరావు, ఓలేరు	819	122	24.05.2018	560000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
2	3467	ఉన్నవ చంద్రశేఖర్ – తండ్రి కోటేశ్వరరావు, రేపల్లె	820	58	24.05.2018	270000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
3	5386	ఉన్నవ నాగశ్రీ చంద్రశేఖర్, రేపల్లె	821	169	24.03.2018	785000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
4	5387	ఉన్నవ అరుణాదేవి కోటేశ్వరరావు, రేపల్లె	822	78	24.05.2018	365000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
5	3089	మల్లిసెట్టి రమేష్ తండ్రి వెంకటరత్నం, పెదలంక	851	131	25.05.2018	600000	ప్రైవేటు గోదాం వెల్లటూరు
6	512బి	పొన్నెకంటి నరేంద్ర తండ్రి బాపనయ్య, వెల్లూరు	858	105	29.05.2018	500000	శ్రీనీలంపాటి లక్ష్మీఅమ్మ వారు కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
7	511బి	కోనేటి వెంకట సతీష్‌బాబు తండ్రి వెంకయ్య, రావెల	859	131	25.05.2018	470000	శ్రీనీలంపాటి లక్ష్మీఅమ్మ వారు కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
8	622బి	చందు శ్రీనివాసరావు, తండ్రి సాంబశివరావు, చదలవాడ	884	139	07.06.2018	640000	శ్రీనీలంపాటి లక్ష్మీఅమ్మ వారు కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
9	527బి	వక్కలగడ్డ చంద్రశేఖర్ తండ్రి సాంబశివరావు, ఆలేపల్లి	888	216	14.06.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
10	623బి	కర్నం రామిరెడ్డి తండ్రి కోటిరెడ్డి, ఆలేపల్లి	901	216	30.06.2018	950000	శ్రీలక్ష్మి విద్య కోల్డ్ స్టోరేజ్, నల్లపాడు
11	569బి	కటియాల వెంకటరామ్ తండ్రి కోటయ్య, అన్నవరపులంక	928	171	31.08.2018	800000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
12	612బి	కటియాల శిరీష భర్త వెంకటరామ్, అన్నవరపులంక	930	191	01.09.2018	890000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
13	613బి	మైనేని శివరామ్, తండ్రి సాంబశివరావు, చిలుమూరు	931	124	26.09.2018	570000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
14	614బి	రావూరి పాండురంగారావు తండ్రి వెంకటేశ్వరరావు, చిలుమూరు	932	218	26.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
15	615బి	రావూరి శ్రీసుష్మ భర్త పాండురంగారావు,చిలుమూరు	934	236	27.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
16	616బి	కోనేటి దాసు, తండ్రి నాగభూషణం, అన్నవరపులంక	935	225	27.09.2018	1000000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
17	617బి	గురిందపల్లి గిరిబాబు తండ్రి బోడయ్య	943	201	05.10.2018	900000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
18	618బి	బొద్దులూరి నాగేశ్వరరావు, తండ్రి వెంకటేశ్వరరావు, పెనుమూలి	944	208	05.10.2018	940000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
19	619బి	మైనేని రఘురామ్, తండ్రి సాంబశివరావు, అన్నవరపులంక	819	122	24.05.2018	870000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల
20	613బి	మైనేని శివరామ్, తండ్రి సాంబశివరావు, చిలుమూరు	946	47	09.10.2018	210000	సెంట్రల్ వేర్‌హౌస్ దుగ్గిరాల
21	620బి	మారుకొండ రాజారావు తండ్రి భూషణం	947	172	09.10.2018	770000	శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్,దుగ్గిరాల

షరతులు:– 1) పాటలో పాల్గొనవలసినవారు వేలము సమయమునకు ముందుగా రూ. 5000/-లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 2) పాట పాడుకున్న వారు సొమ్ము మొత్తమును అదేరోజున చెల్లించి సరుకును స్వాధీనపరచుకొనవలెను. 3)పాటను జరుపుటకు మరియు నిలుపదల చేయుటకు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారికి పూర్తి అధికారము ఉన్నది. 4)పూర్తి వివరముల కొరకు సంఘ ఆఫీసు పనివేళల యందు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని సంప్రదించవలెను.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, PACS, భట్టిప్రోలు